

## పీవీకి భారత రత్న రావటం చాలా గర్వంగా ఉంది

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మాత్యులు పొన్నం ప్రభాకర్

2 లో

నేటి దినపత్రిక
# సూర్య
www.suryatelugudaily.com
ఉమ్మడి వరంగల్
హన్మకొండ, వరంగల్, మహబాద్, భూపాలపల్లి, ములుగు, జనగామ
శనివారం | 10 | ఫిబ్రవరి | 2024 | పేజీలు : 10



# విద్యార్థుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించేలా కృషి చేయాలి

షీ టీమ్స్ ద్వారా బాలికలకు హాస్టల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




హనునమకొండ సూర్య ప్రతినిధి, ఫిబ్రవరి 09, మేజర్ న్యూస్ : జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, కళాశాలలు , సంక్షేమ వసతి గృహాల విద్యార్థినీ, విద్యార్థుల సంక్షేమం పై ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, సంక్షేమ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో జిల్లా లోని ఎస్సీ, ట్రైబల్, బీసీ , మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా బాలికల పాఠశాలల నిర్వహణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, వసతి గృహాల సంక్షేమ అధికారులు, కస్తూర్బా పాఠశాలల ప్రత్యేక అధికారులతో సమీక్ష మిగతా 2లో..

## రోగులకు సేవలందించి మన్నన పొందాలి

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

ప్రభుత్వ వైద్య శాల ఆకస్మిక తనిఖీ

మహబూబాబాద్, ఫిబ్రవరి,9. ఆసుపత్రి పట్ల రోగులకు సద్భావం ఏర్పడాలని అత్యధిక రోగులకు సేవలు అందిస్తూ మన్నన పొందాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ సాధారణ వైద్యశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి వైద్య సిబ్బంది పనితీరును వైద్యశాల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు.విధులలో ఉన్న వైద్యులు డాక్టర్ వెంకట్ లకావత్, డాక్టర్ వెంకట రాములు కలెక్టర్ వెంట హాస్పిటల్ నిర్వహణకై

మిగతా 2లో..

## న్యాయం జరుగుతుందనే భరోసా బాధితులకు కల్పించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పోలీస్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఇన్స్పెక్టర్లు

2 లో





## మహాలక్ష్మి పథకం నమోదు ప్రక్రియ సజావుగా చేయాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆత్మకూరు : ఫిబ్రవరి 09, (సూర్య న్యూస్): మహాలక్ష్మి పథకానికి అర్హులైన లబ్ధిదారుల వివరాలను సజావుగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం మహాలక్ష్మి పథకంలోని లబ్ధిదారుల వివరాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆత్మకూరు మండల కేంద్రంతోపాటు కామారం గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ప్రజా పాలనలోని మహాలక్ష్మి పథకం కోసం దరఖాస్తులను చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వే సభ్యులు పరిశీలన చేస్తున్నారు వారికి కలెక్టర్ ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు. అలాగే గ్రామంలోని ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలను వివరాలను సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. కామారం గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని కలెక్టర్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. లబ్ధిదారుల వివరాల నమోదును త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీష్, మండల ప్రత్యేక అధికారిరాజేందర్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ సంగీత, ఏపీవో రాజిరెడ్డి, గ్రామ కార్యదర్శులు మేడ యాదగిరి మోహన్ రావు, ఇంటింట సర్వే సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పీవీకి భారత రత్న రావటం చాలా గర్వంగా ఉంది

### రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి ఫిబ్రవరి 9 ( సూర్య మేజర్ న్యూస్ ): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కు భారత రత్న రావటం పట్లరాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మాత్యులు పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. పీవీ జాతి మరువ లేని నేత అని, దేశ ఆర్థిక వ్యవస్థ కు పివి ఆయువుపట్టుగా నిలిచాడు అని అన్నారు. పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణ ల ఫలాలే ప్రస్తుతం దేశం అనుభవిస్తుంది అని అన్నారు. ఏఐ సిసి అధ్యక్షులుగా పీవీ ఉన్నపుడు, ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షుని గా పీవిని చాలా సార్లు కలిసిన అనుభవం ఉందని మంత్రి పొన్నం అన్నారు. పీవీ పుట్టిన గడ్డకు హుస్నాబాద్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని మంత్రి పొన్నం అన్నారు.

## న్యాయం జరుగుతుందనే భరోసా బాధితులకు కల్పించాలి

హనుమకొండ సూర్య ప్రతినిధి, ఫిబ్రవరి 09, మేజర్ న్యూస్ : నిజాయితీతో విధులు నిర్వహిస్తూ న్యాయం జరుగుతుందనే భరోసాను బాధితులకు కల్పిస్తూ ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను నూతనంగా స్టేషన్ ఇన్స్ స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన ఇన్స్పెక్టర్లు కమిషనరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పాగుచ్చాలు , పూల మొక్కలను అందచేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్స్పెక్టర్లను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందనలు తెలిపారు. ఆనంతరం కమిషనర్ మాట్లాడారు. సిపి ని కలిసిన వారిలో మట్టేవాడ, హనుమకొండ, నర్సంపేట, పరకాల, ఆత్మకూరు, గీసుగొండ, రఘునాథ్పల్లి సర్కిల్, నెక్కొండ సర్కిల్, వరంగల్ ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్లు గోపి, సతీష్, రమణమూర్తి, అబ్బాయ్య, సంతోష్, బాబులాల్, శ్రీనివాస్, చంద్రమోహన్, శ్రీధర్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి




మొదటి పేజీ తరువాయి..

సమావేశం నిర్వహించి వివిధ అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ శాఖల వసతి గృహాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వసతి గృహాల సంక్షేమ అధికారులు, గురుకుల విద్యాలయాలలో పని చేసే సిబ్బంది అంకిత భావంతో పని చేయాలన్నారు. బాలికల పాఠశాలలు , వసతి గృహాలలో విద్యార్థుల రక్షణ , భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో, వసతి గృహాలలో ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి హెల్త్ కార్డు ఉండే విధంగా విధంగా చూసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో వేసవి కాలం దృష్ట్యా నీటి సమస్యలు లేకండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించేలా కృషి చేయాలన్నారు. షీటీమ్స్ ద్వారా బాలికలకు హాస్టల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పై శ్రద్ద వహించాలని, ఆదేవిధంగా వార్షిక ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రిన్సిపాల్స్ , సంక్షేమ అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్దా శుక్లా, బిసి వెల్ఫేర్ డిడి రామ్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ డిడి నిర్మల, ట్రైబల్ వెల్ఫేర్ డిడి ప్రేమకళ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు సేవలందించి మన్నన పొందాలి



మొదటి పేజీ తరువాయి..

చేపడుతున్న పనులను వివరించారు ముందుగా ఓపి రికార్డులలో నమోదును కలెక్టర్ పరిశీలించి అనంతరం ల్యాబ్ల పనితీరు పరిశీలించేందుకు వార్డులు ప్రత్యేక వార్డులు ప్రసూతి, పిల్లల వార్డులలో పర్యటించారు. సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలని సి సెక్షన్స్ తగ్గించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. రోగులకు అందుతున్న సౌకర్యాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రేడియాలజీ, తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ద్వారా అందుతున్న సేవలను వైద్యులు కలెక్టర్ కు వివరించారు. సాంకేతిక సిబ్బంది కొరత ఉన్నట్లు వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా హాస్పిటల్ పనితీరును వైద్య సిబ్బంది మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని, తన వంతు సహకారం ఉంటుందన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యల సాధనే

# పీఆర్టీయు ధ్యేయం



### మండల అధ్యక్షులు బీరం జనార్ధన్ రెడ్డి

### ఘనంగా పీఆర్టీయు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కేసముద్రం, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ (సూర్య): ఉపాధ్యాయుల సమస్యల సాధనే పీఆర్టీయు టీఎస్ ధ్యేయం అని సంఘం కేసముద్రం మండల అధ్యక్షులు బీరం జనార్ధన్ రెడ్డి అన్నారు.పీఆర్టీయు ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకులు సామల యాదగిరి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కేసముద్రం మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో బీరం జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు బీరం జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ..1971వ, సంవత్సరంలో మహబూబాబాద్ లో సామల యాదగిరి స్థాపించిన పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంఘం అంచలంచలుగా ఎదిగి ఉపాధ్యాయుల సమస్యల సాధన ధ్యేయంగా పనిచేస్తుందని, అత్యధిక ఉపాధ్యాయ సభ్యత్వం కలిగిన ఏకైక సంఘం పీఆర్టీయు అని ఆయన తెలిపారు.ఒక చిన్న మొక్క గా ప్రారంభమై వట వృక్షంగా ఎదిగిన సంఘం పీఆర్టీయు అని, ప్రతి ఉపాధ్యాయుడు పీఆర్టీయు చేరి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని జనార్దన్ రెడ్డి కోరారు.సంఘం మండల ప్రధాన కార్యదర్శి గోపాల శ్రీధర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అతిపెద్ద సంఘం పీఆర్టీయు అని, ఉపాధ్యాయ సంఘాలకే కాకుండా కేజీబీవీ,మోడల్ స్కూల్,ఉద్యోగ సంఘాల సమస్య సాధనలో పీఆర్ టియు ముందుంటుందని అన్నారు.317 జీవోలో భాగంగా నష్టపోయిన ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి పీఆర్టియు అండగా నిలబడుతుందని సంఘం మండల ప్రధాన కార్యదర్శి గోపాల శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీఆర్టీయు కు విశేష సేవలు అందించి త్వరలో పదవీ విరమణ పొందబోతున్న మండల నోడల్ హెచ్ఎం కొత్త



జగన్మోహన్ రెడ్డి,విజయ సుశీల,మడుపు రవీందర్, రాయిలి కోటేశ్వర్లు,కస్తూరి శ్రీహరి,పగిడిపల్లి మల్లయ్య,వేల్పుల ఓదెలు తోపాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొడిపాక రమేష్ ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు రాపోలు యాకయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు నరేందర్,రాష్ట్ర కార్యదర్శి కక్కెర్ల రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు కుర్న హరినాథ్,మండల ఉపాధ్యక్షులు ఉమేశ్వర్, వీరభద్రం ,నాగనబోయిన వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ,శ్రీనివాస్, నిరంజన్,కొప్పుల శంకర్, కోటేశ్వర్ సింగారపు ఉపేందర్,సయ్యద్, లక్ష్మణమూర్తి ,సుజాత,ప్రమీల, రజిత,జ్యోతిశ్రీ పాటు పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఆర్డిఎఫ్ విద్యార్థుల ఎంపిక




పర్వతగిరి , ఫిబ్రవరి 09, సూర్య న్యూస్ : పర్వతగిరి మండలం లోని కల్లెడ గ్రామంలో ఆర్డిఎఫ్ విద్యా సంస్థ ల నుండి ముగ్గురు విద్యార్థులు అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ఆర్డిఎఫ్ స్కూల్ కార్య నిర్వహకులు చారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదిన వరంగల్ జిల్లా అథ్లెటటిక్ అసోసియేషన్ అథ్లెటిక్ ఎంపిక పోటీలు జెఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించారు. ఆర్డిఎఫ్ స్కూల్స్ నుండి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ముగ్గరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. బి. సంజు భార్గవ్ , 400 మీటర్లలో మొదటి స్థానం జి. హర్షణి 300 మీటర్లలో ప్రథమ స్థానం , ఎం. పౌర్యమి లాంగ్ జంప్ లో 3వ స్థానం లభించినట్లు పేర్కొన్నారు. ముగ్గురిని ఫిబ్రవరి 10వ తేదిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులయిన వేళ

### ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవవేడుకలు



నెల్లికుదురు ఫిబ్రవరి 9 మేజర్ న్యూస్(సూర్య): విద్యార్థులు ప్రతిభ కనబరచడానికిప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ గోట్టిముక్కుల ఆదిరెడ్డి అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని ప్రగతి పబ్లిక్ స్కూల్ లోస్వయం పరిపాలన దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు గొట్టిముక్కుల వనిత ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూస్వయం పరిపాలన దినోత్సవం లోవిద్యార్థులుఅత్యుత్తమ ప్రతిభకనబరిచారని అన్నారు.డి ఈ ఓ గాభూక్య ప్రశాంత్,ఎంఈఓ గా జాటోత్ సంగీత,హెచ్ఎం గాగుగులోతు సంధ్య విధులు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయ బృందం మానస,సాహిన,స్వాతి, శ్వేత,వజిత,స్రవంతి,తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ




కేసముద్రం, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ (సూర్య): మండలంలోని తాళ్లపూస పల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ ప్రత్యేక అధికారి కోట కనకయ్య ఆధ్వర్యంలో గ్రామంలో విద్యార్థులచే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పై ర్యాలీ నిర్వహించి గ్రామ ప్రజలకు వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి కోట కనకయ్య మాట్లాడుతూ... గ్రామస్తులు సాంఘిక దురాచారాలు,మద్యం, మత్తు పదార్థాలు, గుట్కాలకు బానిసలు కావద్దని, యువత మద్యం మత్తులో జీవితం నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూస పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# 16 న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

### ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంపెల్లి మునిశ్వర్



చెన్నారావుపేట (సూర్య మేజర్ న్యూస్): ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె భారత్ బంద్ ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంపెల్లి మునిశ్వర్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త కార్మికుల సమ్మె భారత్ బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె భారత్ బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సాంబయ్య, లక్క కుమార్, కుమారస్వామి, మల్లయ్య, సాంబయ్య, పాణి, నరసయ్య, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పీవీకి భారతరత్న తెలంగాణకు గర్వకారణం

### అధ్యక్షులు బింగి రమేష్ యాదవ్



మరిపెడ,ఫిబ్రవరి 09,మేజర్ న్యూస్ (సూర్య):భారత ప్రభుత్వం మాజీ ప్రధాని తెలుగు తేజం తెలంగాణ బిడ్డ స్వర్గీయ పీవీ నరసింహారావు దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న ప్రకటించడం పై బీజేపీ మరిపెడ మండల బిజెపి అధ్యక్షుడు బింగి రమేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుండి ప్రధానిగా పని చేసిన పీవీ నరసింహారావు దేశంలో మొదటి ఆర్థిక సంస్కరణలు తెచ్చి దేశ ఆర్థిక వ్యవస్థ ను పటిష్టం చేసారని ఆయన చదువుకునే రోజుల్లో అప్పటి నిజాం సర్కారుకు వ్యతిరేకంగా వందే మాతర ఉద్యమం చేసారని అలాంటి వ్యక్తి చనిపోతే కనీసం కాంగ్రెస్ పార్టీ ఆయన భౌతికకాయాన్ని కాంగ్రెస్ కార్యాలయంలోకి రానివ్వలేదని ఢిల్లీలో అంత్యక్రియలకు స్థలం ఇవ్వలేదు అని విమర్శించారు.ప్రస్తుతం భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం తెలుగు వారి ఆత్మగౌరవానికి దక్కిన గౌరవం అని పేర్కొన్నారు

# ఆయుర్వేద వైద్యంలో మెరిసిన విద్యార్థిని

### యూనివర్శిటీ స్థాయిలో స్టేట్ టాపర్

### పలువురి ప్రశంసలు పొందిన డాక్టర్ సౌమ్య శ్రీ

జనగామ ప్రతినిధి ఫిబ్రవరి 09 మేజర్ న్యూస్( సూర్య): విశాల భారతి డా.వై.యస్.ఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం పరిధిలో ఆయుర్వేద మెడిసిన్ ( బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేద మెడిసిన్ అండ్ సర్జరీ ) పరీక్ష ఫలితాల్లో వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ప్రాంతానికి చెందిన విద్యార్థిని పాశికంటి సౌమ్యశ్రీ యూనివర్సిటీ టాపర్ గా నిలిచారు.ఆమె తల్లిదండ్రులు పాశికంటి రమాదేవి, శ్రీనివాస్ ల ప్రోత్సాహంతోనే పతకాలు బహుమతులు పొందటం జరిగిందని సౌమ్యశ్రీ శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే..వరంగల్, హన్మకొండ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద విద్యా కళాశాలలో 2015-2016 సంవత్సరంలో (బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేద మెడిసన్ అండ్ సర్జరీ) విద్యలో చేరింది. ఫిబ్రవరి 6వ తేదిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం 26వ స్నాతకోత్సవం అట్టహాసంగా నిర్వహించడం జరిగింది. విజయవాడలోని వెన్యూ కళ్యాణ మండపంలో ప్రతిభ చూపి రెండు తెలుగు రాష్ట్రాల నుండి స్టేట్ టాపర్ గా నిలిచినందుకు విద్యార్థిని డాక్టర్.పాశికంటి సౌమ్యశ్రీకి బిఏఎంఎస్ ఆయుర్వేదిక్ మెడిసిన్ లో ఒక బంగారు పతకం,రెండు వెండి పతకాలు బహుమతులు రావటం జరిగింది.ఈ స్వర్ణ పతకాలను యూనివర్సిటీ ఛాన్స్ లర్, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అందజేశారు.తన తల్లిదండ్రులు,కుటుంబ





సభ్యుల ప్రోత్సాహంతోనే తాను యూనివర్సిటీ స్థాయిలో టాప్ ర్యాంక్, బహుమతులు, పతకాలు సాధించగలిగానని సౌమ్యశ్రీ తెలిపారు.డాక్టర్ పాశికంటి సౌమ్యశ్రీ విద్యనభ్యసిస్తున్న సమయంలో ప్రసూతి స్త్రీ రోగ చికిత్స,శల్య చికిత్సలో రెండు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ప్రసూతి స్త్రీ రోగ చికిత్సలో పీజీ చేసి మహిళలకు మంచి వైద్య సేవలను అందించాలని తమ కోరిక ఉన్నట్లు తెలిపారు.రానున్న రోజుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

**చాలా సంతోషంగా ఉంది**
**సౌమ్యశ్రీ తల్లిదండ్రులు:**

పి.రమాదేవి,శ్రీనివాస్. మా కూతురు డా.పాశికంటి సౌమ్యశ్రీ కి ఆయుర్వేద మెడిసిన్ అండ్ సర్జరీ చదవాలని చిన్నప్పటి నుండి ఎంతో కోరికగా ఉండేది. తన కోరిక మేరకు పట్టుదలతో చదువుతూ వచ్చింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదల విడువలేదు.. తన కష్టానికి ప్రతిఫలం లభించింది. రానున్న రోజుల్లో మరింత ఉన్నతమైన స్థాయికి ఎదిగి నిరుపేదలకు అండగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము..మా కూతురు సౌమ్యశ్రీ కి పతకాలు, బహుమతులు రావటంతో కుటుంబ సభ్యులు కూడ ఎంతో సంతోషంగా ఉన్నారు.

# గ్యాస్ ఆన్ లైన్ ప్రక్రియను పరిశీలించిన ఎంపిఓ

చెన్నారావుపేట (సూర్య మేజర్ న్యూస్): గ్యాస్ ఆన్ లైన్ ప్రక్రియను మండల పంచాయతీ అధికారి, ఖాదర్ పేట గ్రామ స్పెషల్ ఆఫీసర్ అంబటి శ్రీధర్ రాజు పరిశీలించారు. శుక్రవారం మండలంలోని ఖాదర్ పేట, జల్లి, ఎల్లయ్య గూడెం గ్రామాలలో నిర్వహిస్తున్న గ్యాస్ ఆన్ లైన్ ప్రక్రియను పరిశీలించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో లబ్దిదారులు ఆరు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో భాగంగా గ్యాస్ ను వినియోగిస్తున్న వినియోగదారులు 500 కు గ్యాస్ పథకానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. వినియోగదారులు గ్యాస్ నెంబర్లను సక్రమంగా వేశారా.. లేదా... అని ఇంటింటికి తిరిగి అడిగి తెలుసుకుంటూ ప్రత్యేక యాప్ లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ వినియోగదారులు తాము వినియోగిస్తున్న గ్యాస్ కు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సూచించారు. ఈ ప్రక్రియను గ్రామాలలో వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వీరన్న, మహేష్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.



# జాతర నిర్వహణలో రాజకీయ జోక్యం తగదు

**రాజకీయ జోక్యంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది**

**పాత పద్ధతిలోనే జాతర కమిటీతో నిర్వహణకు ఎండోమెంట్ అధికారుల గ్రీన్ సిగ్నల్**

**జాతర నిర్వహణ పూర్తయిన తర్వాతనే కొత్త కమిటీని ప్రకటిస్తాం**

**ఎండోమెంట్ అధికారులు**

మొగుళ్ళపల్లి ఫిబ్రవరి 9 మేజర్ న్యూస్ సూర్య: మండలంలోని మొగుళ్ళపల్లి-ముల్కలపల్లి గ్రామాల మధ్యన రెండు గ్రామాలకు చెందిన ప్రజలు కొంత భూమిని శ్రీ సమ్మక్క-సారలమ్మ మినీ మేడారం జాతరకు కేటాయించి..1977లో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు కొన్ని డబ్బులు చందాల రూపకంగా వేసుకొని, అందులో సభ్యత్వ రుసుం పొంది..రెండు గ్రామాలలో సభ్యత్వం పొందిన జాతర నిర్వహణ కమిటీ సభ్యులు ఒక ఒప్పందం చేసుకున్నారు.

అప్పటినుండి ఒక మారు చైర్మన్ పదవి మొగుళ్ళ పల్లికి వస్తే..మరో మారు ముల్కలపల్లి గ్రామస్తులకు ఇచ్చుటకు అంగీకారం చేసుకున్నారు. అప్పటినుండి జాతర నిర్వహణలో ఏలాంటి లోటుపాటులు లేకుండా..రాజకీయ ప్రమేయం లేకుండానే జాతర నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేవారు. అందులో పార్టీలకతీతంగా అందరూ సమన్వయంతో జాతర కమిటీకి సహకరించేవారు. కానీ ఈనెల 21, 22, 23న నిర్వహించే మినీ మేడారం జాతరకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. దీంతో జాతర కమిటీ ఏర్పాటులో రాజకీయ నాయకులు వర్సెస్ జాతర కమిటీ డైరెక్టర్లు అనే రీతిన కమిటీలు ఏర్పడడంతో..వనదేవతలైన సమ్మక్క- సారల మ్మ జాతరను ఏ కమిటీ నిర్వహిస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూ స్తున్నారు. రాజకీయ జోక్యం లేనప్పుడే జాతరను ఒక మహా ఉత్సవంల నిర్వహించే వారని, ఇప్పుడు రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో జాతర నిర్వహణ సజావుగా సాగేనా..? అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రంగప్రవేశం చేసిన ఎండోమెంట్ అధికారులు జాతర నిర్వహణలో రాజకీయ జోక్యం తగదని, రాజకీయ జోక్యంతో జాతర నిర్వహణ సజావుగా సాగక ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, పాత పద్దతిలోనే జాతర కమిటీతో నిర్వహణకు ఎండోమెంట్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జాతర నూతన కమిటీకి ఐదుగురు సభ్యులతో ఏర్పాటుకు ఈనెల 8న నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్ జారీ అయినప్పటినుండి ఫిబ్రవరి 28 వరకు అర్హులైన వారు ఆన్లైన్ దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. కాగా కొత్త కమిటీ ఏర్పాటు సమయానికి జాతర నిర్వహణ సమయం ముగిస్తుంది. కాబట్టి ఈ ఏడాది పాత కమిటీ పద్దతిలోనే జాతర కమిటీని ఏర్పాటు చేసుకొని యధావిధిగా జాతరను కొనసాగించుకోవాలని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా పాత పద్దతిలోనే శ్రీ సమ్మక్క-సారలమ్మ మినీ మేడారం జాతరను కొనసాగించే అవకాశం ఉంది.

# గ్రామపంచాయతీ రికార్డుల తీరును మెరుగుపరచాలి



## అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్

### వావిలాల గ్రామాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

నెల్లికుదురు ఫిబ్రవరి 9 మేజర్ న్యూస్(సూర్య): గ్రామపంచాయతీ రికార్డులు రోజువారీగా పరిశీలిస్తూపనితీరును మెరుగుపరచాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ అన్నారు.శుక్రవారం మండలంలోని వావిలాల గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూగ్రామపంచాయతీ కార్యాలయం,అంగన్వాడి కేంద్రాలు, మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల,పాఠశాలలోనిమరుగుదొడ్లు మధ్యాహ్న భోజనపథకం,నర్సరీ వైకుంఠధామాల నిర్వహణ తీరును పరిశీలించామనిఅన్నారు.గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి టాక్స్ కలెక్షన్ వివరాలు అడిగి తెలుసుకున్నామని అన్నారు.100%టాక్స్ చేపట్టాలన్నారు. గ్రామంలో పర్యటించి,పారిశుధ్యం పనితీరును పెంచాలని అధికారులకు సూచించారు.నర్సరీ నిర్వహణ పెంపొందించాలని,వైకుంఠధామాలు దహన సంస్కారాలకు ఉపయోగించుకునేలాచర్యలు తీసుకోవాలన్నారు. సిగ్రిగేషన్ సందర్శించి షెడ్ లోచెత్త విభజన రోజువారిగాజరగాలని,ప్లాస్టిక్ వాడకాన్నితగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి,పంచాయతీ సెక్రెటరీ నాగజ్యోతి,మాజీ సర్పంచ్ బోల్లెపల్లి శ్రీనివాస్,ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.







## చేతి పంపు బోరున విలపిస్తుంది

### పట్టించుకునే నాధుడే లేడు



రేగొండ ఫిబ్రవరి 9 మేజర్ న్యూస్ సూర్య : చేతి పంపు బోరున విలపిస్తుంది.గత కొన్నేళ్లుగా ఎంతోమంది బాటసారులకు, వాహనదారులకు దాహర్తిని తీర్చి లారీ డ్రైవర్ల అవసరాలకు అండగా నిలిచిన ఆ పంపు ఈరోజు నేల వాలింది. మండలంలోని తిరుమలగిరి గ్రామ ఆర్చి వద్ద పరకాల భూపాలపల్లి జాతీయ రహదారికి ఆనుకుని ఓ మంచి నీటి చేతి పంపు ఉంది.గత కొన్నేళ్లుగా తిరుమలగిరి గ్రామానికి వచ్చే బాటసారులకు, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు దాహాన్ని తీర్చేది.లారీ డ్రైవర్లు వారి నీటి అవసరాలు తీర్చుకునేందుకు ఆ పంపును వాడేవారు. కానీ కొన్ని రోజుల క్రితం ఏమైందో ఏమో ఎవరైనా కావాలని చేశారో, అనుకోకుండా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందో చేతి పంపు మాత్రం నేల మట్టమయింది. ఇన్నేళ్లుగా అవసరాలు తీర్చిన ఆ పంపును మాత్రం పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం చొరవ తీసుకొని ఆ నీటి పంపును రిపేరు చేయవలసిందిగా కోరుతూ ఓ బాటసారి ఆవేదన వ్యక్తం చేశాడు.



## ప్రత్యేకాధికారిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

సంగెం ఫిబ్రవరి 09(మేజర్ న్యూస్ సూర్య): ప్రభుత్వం ఇటీవల గ్రామపంచాయతీలకు కొత్తగా ప్రత్యేక అధికారులను నియమించింది. మండలంలోని గుంటూరుపల్లి గ్రామ ప్రత్యేక అధికారిగా నియమితులైన యాకయ్యను శుక్రవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీ పథకాలను అందించాలని కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందిమల్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పాతూరి రామారావు, ముఖ్య నాయకులు గోపాలపు రాధాకృష్ణ ,పసునూరి భాస్కర్ , నంజ్యాల నరసింహారావు,కొంగర భాస్కర్,దండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ

కాటారం, ఫిబ్రవరి 09, మేజర్ సూర్య న్యూస్: లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ సహకారంతో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఉపాధి అవకాశం కల్పించబడును. నిరుద్యోగులకు వైర్ హౌస్, నెట్వర్క్ టెక్నీషియన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్, ఫార్మసీ అసిస్టెంట్ కోర్సులు ఉచిత శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలిపారు. శిక్షణలో హాస్టల్ వసతి రెండు జతల బట్టలు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయబడునని ప్రాజెక్టు మేనేజర్ శివ తెలిపారు. వివరాలకు వై టి సి కాటారం ఇంచార్జ్ బొడ్డు రాజబాబు 9704350634 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి ఇద్దరు సస్పెండ్

### తిమ్మరాయిని పహాడ్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ఏటుకూరి జయరాజు

చెన్నారావుపేట (సూర్య మేజర్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ నుండి ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు తిమ్మరాయిని పహాడ్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ఏటుకూరి జయరాజు శుక్రవారం తెలిపారు. తిమ్మరాయిని పహాడ్ గ్రామానికి చెందిన పూదోట దాసయ్య, పూదోట నవీన్ లు ఇద్దరు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ గ్రామ కమిటిని ధిక్కరిస్తూ మాదే పార్టీ మేమే అధ్యక్షులం అని చెప్పుకుంటూ తిరుగుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆదేశాల మేరకు పూదోట దాసయ్య, నవీన్ వీరిద్దరిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. వీరిద్దరికి కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంద నరేష్, విజయ్, పెద్దరాజు, దాసరి కిషోర్, జార్జెస్, మహమ్మద్ నిజాముద్దీన్, నాగోతు బాల జోజి, పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న

## హర్షం వ్యక్తం చేసిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్దాం హుస్సేన్



వేలేరు ఫిబ్రవరి 09 సూర్య న్యూస్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన పీ.వీ నరసింహారావు భారత రత్న ప్రకటించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేసిన సద్దాం హుస్సేన్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వేలేరు పాఠశాలకు దేశవ్యాప్తంగా పేరు తీసుకువచ్చిన పీవీ నరసింహారావు మన పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించడం వేలేరు ప్రాంత బిడ్డలుగా మనందరికీ గర్వకారణ మని అన్నారు. మనమందరం గర్వించవల్సిన విషయమని కొనియాడు తూ వేలేరు అంబేడ్కర్ సెంటర్లో బాణసంచా పేల్చి స్వీట్లు తినిపించుకు న్నారు.. కాంగెస్ పార్టీగ్రామశాఖ అధ్యక్షుడు కారం శ్రీనివాస్ రెడ్డి వార్డు సభ్యుడు బైరి అనిల్ ,యూత్ కాంగెస్ ఉపాధ్యక్షుడు అక్కల పశాంత్,రణధీర్ రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జ్ సలీంమాలిక్ , శీకాంత్,సంపత్,ఖాసీం అందె రాజు,అజయ్,శివపసాద్,వెంకన్న, అఖిల్, తదితరులు పాల్గొన్నారు..

## పీవీకి భారత రత్న తెలంగాణకు గర్వ కారణం

### బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మడికొండ శ్రీను



పరకాల, ఫిబ్రవరి 09, సూర్య న్యూస్: మాజీ ప్రధాని, తెలుగు తేజం తెలంగాణ బిడ్డ స్వర్గీయ పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారమైన భారత రత్న ప్రకటించడం తె లంగాణకు గర్వకార ణమని బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు మడి కొండ శ్రీను అన్నారు. ఈ సందర్భంగా మడికొండ శ్రీను మాట్లాడుతూ దక్షణ భారత దేశం నుంచి తెలుగు రాష్ట్రం నుండి ఏకైక ప్రధానిగా కొన సాగి దేశాన్ని ఆర్థిక లోటు నుంచి ఎదుగు తున్న దేశంగా తయారు చేసిన ఘనత పీవీకే దక్కుతుందన్నారు. సంస్కరణల పితా మహునిగా పేరు పొంది భారత దేశాన్ని అగ్ర రాజ్యాల సరసన నిలబెట్టిన ఘనత పివి నరసింహారావుకే దక్కుతుందన్నారు. పీవీ కి భారత రత్న ప్రకటించాలని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని మడికొండ శ్రీను తెలిపారు.

## నెక్కొండ సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ఐ శ్రీనివాస్



చెన్నారావుపేట (సూర్య మేజర్ న్యూస్): నెక్కొండ సిఐగా చంద్ర మోహన్ నూత నంగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పస్తం శ్రీనివాస్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఐ చంద్రమోహన్ పోలీస్ స్టేషన్ లో పోలీస్ సిబ్బందికి శాంతి భద్రతల పరిరక్షణ పై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణమూర్తి, హెడ్ కానిస్టేబుళ్లు స్వామి, ఎల్లయ్య, జంపయ్య, కానిస్టేబుళ్లు స్వామి నాయక్, సురేష్, తిరుపతి, జ్ఞానేశ్వర్, నరేష్, అరవింద్, స్వామి, హోంగార్డు పూలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పిఆర్టీయూ 53 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మరిపెడ,ఫిబ్రవరి 09,మేజర్ న్యూస్ (సూర్య):మరిపెడ మున్సిపల్ కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో శుక్ర వారం పిఆర్టీయూ 53 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల శాఖ అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానుకోట గడ్డపై పుట్టిన సామల యాదగిరి పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల కోసం 52 సంవత్సరాల క్రితం పిఆర్టీయూ సంఘాన్ని స్థాపించారన్నారు.నేడు అంచలంచలుగా ఎదిగి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు.సంఘం ద్వార నేడు అన్ని సమస్యలు సాధించబడ్డాయని భవిష్యత్తులో కూడా సంఘం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్,స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంత రావు,రాష్ట్ర బాధ్యులు దోమల లింగన్న,రాంమోహన్ మండల బాధ్యులు వెంకన్న,ప్రేమ్ సాగర్,రజిత, సృజన ,బాబురావ౨,హరి, సారయ్య,సురేష్,నామా,యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోలంతో నులిపురుగులకు చెక్

## మరిపెడ పీహెచ్ సీ డాక్టర్ మానస



మరిపెడ,ఫిబ్రవరి 09,మేజర్ న్యూస్ (సూర్య): ఆల్బెండ జోలం మాత్రలతో పిల్లల్లో నులిపురుగులకు చెక్ పెట్టవచ్చని ,1-19ఏళ్ల వారికి తప్పకుండా ఈ మాత్రలు వేయాలని మరిపెడ పీహెచ్ సీ డాక్టర్ మానస అన్నారు.శుక్రవారం మహ బూబాబాద్ జిల్లా మరిపెడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం లో భాగంగా నులిపురుగుల నిర్మూలనపై మండలంలోని మరిపెడ ఎంపీడీఓ కార్యాలయంలో టీచర్ల కు,ఏఎన్ఎం, ఆశ,అంగన్వాడీ టీచర్లకు,ఫిబ్రవరి 20న జరిగే కార్యక్రమంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ మరిపెడ మండలం పరిధిలో 1-19 సంవత్సరాలు ఉన్న పిల్లలకు ఆల్బెండజోలు టాబ్లెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.నులిపురుగులు ఉన్నా పిల్లలు తరుచుగా కడుపు నొప్పి చెప్పడం,ఆకలి మందగించడం, చదువు పై శ్రద్ధ తగ్గడం, రక్త హీనత, బరువు తగ్గడం,ఎదుగుదల లేకపోవడం వంటి లక్షణాలు కనిపించడం జరుగుతుంది. కార్యక్రమంలో మండలంలో ఉన్నా పాఠశాల హెడమాస్టర్స్, టీచర్లు, హెల్త్ సూపెర్వైజర్ కృష్ణ, వెంకటేశ్వర్లు, సుదర్శన్, ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎంలు,ఆశాలు,అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.




# ఫ్రెండ్లీ పోలీసులుగా సేవలు అందించడం అభినందనీయం

## పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి



పరకాల, ఫిబ్రవరి 9, సూర్య న్యూస్ : పరకాల సిఐ జె. వెంకటరత్నం ఫ్రెండ్లీ పోలీస్గా సేవలు అందించడం అభినందనీయమని పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్కూరి దేవేందర్రెడ్డి అన్నారు. బదిలీపై వెళ్లుతున్న సిఐ వెంకటరత్నంకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కట్కూరి దేవేందర్ రెడ్డి మాట్లాడారు.

## నూతన సిఐని మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు

పరకాల సిఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం. అబ్బయ్యను పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంచగిరి బయమ్మ హరిప్రసాద్, పర్నెం మల్లారెడ్డి, దాసరి బిక్షపతి, అల్లం రఘునారాయణ, ఇనగాల రమేష్, కోసరి రాజు, బొమ్మకంటి చంద్ర మౌళి, మంద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

## ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రేస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు



హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 9, మేజర్ న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు అన్నారు.ఉస్మానియా విద్యార్థి నాయకునిగా, తెలంగాణ ఉద్యమ నాయకుడు అని చెప్పుకునే బాల్క సుమన్ ఎన్నికల్లో ఓటమికి గురై విచక్షణ కోల్పోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బలంతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధించిన గెలుపును బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం జీర్ణించుకోవడంలేదు.బడుగు బలహీన వర్గాల సంక్షేమ ధ్యేయంగా ఇచ్చిన 6 గ్యారంటీల పథకాలను అమలు చేసే దిశగా ప్రజా దీవెనలతో ముందు సాగుతున్న ప్రభుత్వ పాలనను బిఆర్ఎస్ నాయకత్వంతో పాటు జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలు జీర్ణించుకోవడం లేదు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తక్షణమే భేషరతుగా వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. బాల్కసుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వేముల రమేష్, కందుకూరి రజినీకాంత్, సిద్ధం యుగేందర్, అరుణ్ ప్రసాద్,మహేందర్, కునూరు రంజితకుమార్, ఆనందమోహన్, తోట రాజకుమార్, పోతారాజురవి, రమేష్ నాయక్, నల్ల మహాత్మా, విజయ్ భాస్కర్ రెడ్డి, నిఖిల్, శ్రీనాథ్, వినయ్, జగన్మోహనరెడ్డి, పోషిని రవీందర్, రావుల శ్రీనివాసరెడ్డి, పిల్లి కార్తీక్, అరుణ్, సుదర్శన్, మునిగాలా రవీందర్, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

## కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

## పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పరకాల, ఫిబ్రవరి 09, సూర్య న్యూస్ : రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఎంటో చాటాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం హనుమ కొండ లోని వారి నివాసంలో నియోజకవర్గంలోని పరకాల, నడికూడా , ఆత్మకూర్, దామెర, గీసుకొండ , సంగెం మండలాల ఎంపిపి, జడ్పీటీసీ, మండల అధ్యక్షులు, ఎం పిటీసిలు, మాజీ సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ గడిచిన పది సంవత్సారాలలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సక్రమంగా వినియోగిస్తూ ,పంచాయతీలను అభివృద్ధి చేయడంలో సర్పంచుల కృషి మరవలేనిదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కి కృషి చేసిన గడువు ముగిసిన



సర్పంచులను చల్లా ధర్మారెడ్డి అభినందించారు.బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడకుండా ముందుకు సాగాలని, వారికి తనతో పాటు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని అన్నారు. తాను ప్రజల మధ్య ఉంటానని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు. రాబోయే పార్లమెంట్ , స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఎంటో చూపాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు , నా యకులు ప్రజా క్షేత్రంలో ఉంటూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పిలుపు నిచ్చారు. మీ అందరి సహకారంతో పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కాంగ్రెస్ నాయకులు అహంకారంతో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. చిన్నా, పెద్ద వయస్సు అనుభవంతో తేడా లేకుండా స్థాయిని మరిచి ప్రవర్తిస్తున్నారని అన్నారు. కేసీఆర్ సర్కారు మొదలు పెట్టిన పనులే ఇప్పుడు ప్రారంభిస్తున్నారని మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పరకాల నియోజకవర్గ ప్రజల తరుపున పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్ పిలుపునిచ్చారు

తొర్రూర్.జనవరి 9మేజర్ న్యూస్ (సూర్య): ఫిబ్రవరి 16న జరిగే సార్వత్రిక సమ్మె కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్, తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) తొర్రూర్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు స్వరూప లు పిలుపునిచ్చారు. శుక్రవారం తొర్రూర్ పట్టణ కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో యాడిసి రుక్సానా బేగం కు ఈనెల16వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మె భారత్ బంద్ లో అంగన్వాడి టీచర్లు అండ్ హెల్పర్లు పాల్గొంటారని తెలియజేస్తూ సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా బొల్లం అశోక్, పసుల స్వరూప లు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం , కార్మిక ఉద్యోగులు , అసంఘటిత కార్మికుల పట్ల అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా అఖిల భారత స్థాయిలో ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె , గ్రామీణ బంధు పాటించాలని జాతీయ సంఘాలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమ్మెకు జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ సిఐటియు, ఐ ఎన్ టి యు సి, ఏఐటీయుసీ, టీఎన్టియుసి, హెచ్ఎంఎస్, ఐఎఫ్ టియు, బిఆర్టియు, సంఘాలు అన్నీ కలిసి సమ్మెతో పాటు బంధు పాటించాలని ఈ సంఘాలు నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. అఖిలభారత పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఉన్న అంగన్వాడి ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని ముందస్తుగానే అధికారులకు సమాచారాన్ని అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమ్మెలో



ప్రధానంగా ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ప్రతి అంగన్వాడి ఉద్యోగిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి శైలజ, సిఐటియు మండల కన్వీనర్ జమ్ముల శ్రీను, శ్రీలక్ష్మి, మంజుల, పద్మారాణి,తదితరులు ఉన్నారు

### భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకీ అత్యున్నత

## పురస్కారం భారతరత్న ప్రకటనపై హర్షం

### కృతజ్ఞతలు తెలిపిన సామాజిక కార్యకర్త,

### పివి సేవా సమితి అధ్యక్షులు పిడిశెట్టి రాజు



భీమదేవరపల్లి ఫిబ్రవరి 09 ( సూర్య మేజర్ న్యూస్): , భారతదేశ నూతన ఆర్థిక సంస్కరణల పితామహుడు, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, భారత మాజీ ప్రధాని పీవీ నరసిం హారావు కీ భారత దేశ అత్యు న్నత పురస్కారమైన భారత రత్న వరించడం పట్ల ప్రముఖ సామాజిక కార్యకర్త, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పిడిశెట్టి రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తెలంగాణ మేధావులు, తెలుగు తొలి ప్రధాని పివి నరసింహారావు కీ భారతర త్నతో సత్కరిస్తున్నందుకు సంతోషిస్తున్నాము. విశిష్ట పండితుడు ,రాజనీతిజ్ఞుడిగా, నరసింహారావు భారతదేశానికి వివిధ హోదాలలో విస్తృతంగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమం త్రిగా, అనేక సంవత్సరాల పాటు పార్లమెంటు, శాసనసభ సభ్యునిగా చేసిన కృషిని ఆయన సమానంగా గుర్తుంచుకుంటారు. భారతదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో అతని దూరదృష్టి గల నాయకత్వం కీలకపాత్ర పోషించింది, దేశం యొక్క శ్రేయస్సు అభివృద్ధికి బలమైన పునాది వేసింది. ప్రధానమంత్రిగా నరసింహారావు పదవీకాలం భారత దేశాన్ని ప్రపంచ మార్కెట్లకు తెరిచిన ముఖ్యమైన చర్యలతో గుర్తించబ డింది, ఇది ఆర్థిక అభివృద్ధి యొక్క కొత్త శకాన్ని ప్రోత్సహిస్తుంది. ఇంకా, భారతదేశం యొక్క విదేశాంగ విధానం, భాష , విద్యా రంగాలకు ఆయన అందించిన సహకారం భారతదేశాన్ని క్లిష్టమైన పరివర్తనల ద్వారా నడిపించడమే కాకుండా దాని సాంస్కృతిక , మేధో వారసత్వాన్ని సుసంపన్నం చేసిన నాయకుడిగా అతని బహుముఖ వారసత్వాన్ని నొక్కి చెబుతుంది.ఆ మహానుభావుడికి మాజీ ప్రధాని చరణ్ సింగ్, హరిత విప్లవ పితామహుడు ఎం ఎస్ స్వామినాథ్ లకు భారతరత్న ప్రకటన పట్ల భారత కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలియజేస్తూ గతంలో పివికి భారతరత్న ఇవ్వాలని వంగర నుండి ఢిల్లీ వరకు సైకిల్ యాత్ర చేసి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కి వినతిపత్రం సమర్పించామని రాజు పేర్కొన్నారు.



### 108 నియోనేటల్

## సేవలపై అవగాహన

మహాదేవపూర్. ఫిబ్రవరి 9. మేజర్ న్యూస్ సూర్య: మహాదేవపూర్ మండలం అంబట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఏఎన్ఎంలు ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. 108నియోనేటల్ సర్వీస్ పై ఆశాలకు ఏ ఎన్ ఎం లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, అప్పుడే పుట్టిన పిల్లల నుండి మూడు సంవత్సరాల వయసు వారికి నియోనేటల్ వాహనంలోని ఉన్న అత్యధునిక సదుపాయాలపై డెమో చూపించారు. నియోనేటల్ ఏవిధంగా ఉపయోగించాలో అవగాహన కల్పించారు.108,102, ఎఫ్ ఎస్ హెచ్ ల సర్వీసులను అదేవిధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ తిరుపతి, పైలెట్ ఓదెలు. మెడికల్ అధికారి రామారావు,సూపర్వైజర్ నిర్మల. ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి, పథకానికి లబ్ధిదారుల క్షేత్ర తనిఖీలు



## దరఖాస్తులను పరిశీలించిన ప్రత్యేక అధికారులు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 9 ( సూర్య మేజర్ న్యూస్): మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 లకు గ్యాస్ సిలిండర్ పథకానికి లబ్ధిదారుల క్షేత్ర తనిఖీలు చేపట్టినట్లు ప్రత్యేక పంచాయతీ అధికారులు తెలిపారు. మండలంలోని చంటయ్య పల్లి, కొత్తకొండ, ముల్కనూర్ గ్రామాలలో డి ఎల్.పి ఓ సుదర్శన్ తో పాటు గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు కలిసి గ్యాస్ సిలిండర్ పథకం క్షేత్ర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం క్రింద రూ.500 లకు గ్యాస్ సిలిండర్ అందించేందుకు లబ్ధిదారుల క్షేత్ర పరిశీలన చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం ప్రత్యేకమైన యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ పథకం కొరకు మండల వ్యాప్తంగా సుమారు 11000 దరఖాస్తులు రాగా, 5235 దరఖాస్తులు రేషన్ కార్డ్ డాటాబేస్ తో మ్యాపింగ్ అయివున్నట్లు ఆయన తెలిపారు. మిగిలిన 6765 దరఖాస్తులపై క్షేత్ర తనిఖీలు చేయాలన్నారు. దరఖాస్తుల్లో గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారుని నెంబరు పొందుపర్చని చోట వివరాలు సేకరించాలన్నారు.

కుటుంబం యూనిట్ దరఖాస్తుల పరిశీలన చేయాలన్నారు. మండలంలో ముగ్గురు గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నట్లు, ప్రతి వినియోగదారుడు గ్యాస్ కనెక్షన్ ను ఆధార్ తో లింక్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్యాస్ కనెక్షన్ లేని కుటుంబానికి అట్టి విషయం నమోదు చేయాలన్నారు. లబ్ధిదారుల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందులో ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్, పంచాయతీ కార్యదర్శులు అనిల్ కుమార్, వేణు రెడ్డి తోపాటు అంగన్వాడి టీచర్ రమాదేవి, సిఏ గుంటి పద్మ, బ్రహ్మచారి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని పరిశీలన చేశారు.



ఎమ్మెల్యే సతీష్ బాబు ఫైల్ ఫోటో భీమదేవరపల్లి

# భారత దేశ కీర్తిని దశ దిశలా చాటిన పివి

### మాజీ ఎంపీ కెప్టెన్ వి లక్ష్మి కాంతారావు,

### మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

భీమదేవరపల్లి ఫిబ్రవరి 9 ( సూర్య మేజర్ న్యూస్ ): పీవీకి భారతరత్న పట్ల హర్ష వ్యక్తం చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వి లక్ష్మి కాంతారావు, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు భారత దేశ కీర్తి ప్రతిష్టలను ఉన్నత స్థాయికి చేర్చారని మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వి లక్ష్మి కాంతారావు, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ అన్నారు. భారత ప్రభుత్వం పీవీ నరసింహారావు కు భారతరత్న ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. పీవీ బహుభాషా కోవిదుడని, గొప్ప పరిపాలన దక్షుడని శాసనసభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ప్రధానమంత్రిగా ఎన్నో పదవులను నిర్వహించాలని పదవులకు వన్నె తెచ్చారని, మచ్చలేని జీవితాన్ని గడిపారని ప్రశంసించారు. నాడు మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్లపాటు నడిపి తన రాజకీయ చాణక్యత ప్రదర్శించారని అన్నారు. నాడు అప్పుల ఊబిలో కూరుకుపోయిన భారతదేశాన్ని తన ఆర్థిక సంస్కరణలతో అభివృద్ధి విషయంలో పరుగులు పెట్టించారని, నాడు పీవీ తీసుకున్న నిర్ణయాల వల్లనే నేడు అభివృద్ధి సాధ్యం అవుతోందని గుర్తు చేసుకున్నారు. పివీ తీసుకున్న నిర్ణయాల ఫలితంగా నేడు భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి విషయంలో దూసుకు పోతోందని, సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశ పెట్టడం ద్వారా పారిశ్రామిక రంగంలో ఎన్నో పెట్టుబడులు వచ్చాయని, తద్వారా కోట్లాదిమందికి ఉపాధి అవకాశాలు వచ్చాయని అన్నారు. పివి లేని ఆధునిక భారతదేశాన్ని మనం ఊహించుకోలేమని పేర్కొన్నారు. పివి కి తమ కుటుంబంతో ఎంతో అనుబంధం ఉందని, ఆయన స్వగ్రామం భీమదేవరపల్లి మండలం వంగర నాడు హుజురాబాద్, నేడు హుస్నాబాద్ నియోజకవర్గం లో ఉండడం, పీవీ మన ప్రాంత ముద్దుబిడ్డ కావడం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఇది మొత్తం ప్రపంచమే గర్వించదగ్గ నేత అని కొనియాడారు. పీవీకి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయుల సమస్యలపై పిఆర్టీయు కృషి చేస్తుంది

### పిఆర్టీయు మండల అధ్యక్షులు యుగంధర్ రెడ్డి

### ఘనంగా పిఆర్టీయు ఆవిర్భావది నోత్సవవేడుకలు



నెల్లికుదురు ఫిబ్రవరి 9 మేజర్ న్యూస్(సూర్య): ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేది పిఆర్టియు మాత్రమేనని పిఆర్టియు మండల అధ్యక్షులు సొంటి రెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు.శుక్రవారం మండలకేంద్రంలోనివిద్యా వనరుల కేంద్రం ఆవరణంలో పి ఆర్ టి యు మండల అధ్యక్షులు సొంటి రెడ్డి యుగంధర్ రెడ్డి పతాక ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రతి చిన్న సమస్య నుండి పెద్ద సమస్య వరకు సమస్యను పరిష్కరించడానికి వీఆర్టీయూ సర్వ విధాలపరిష్కరించడానికి దోహదపడుతుందని యుగంధర్ రెడ్డి అన్నారు.అత్యధికఉపాధ్యాయసభ్యత్వంకలిగినఏకైక సంఘంపిఆర్ టి యు అని అన్నారు.317 జీవోలో భాగంగా నష్టపోయిన ప్రతి ఉపాధ్యాయుడికిపి ఆర్ టి యు అండగా నిలబడుతుందని అన్నారు.ఉపాధ్యాయ సంఘాల కే కాకుండాకేజీబీవీ,మోడల్ స్కూల్,ఉద్యోగ సంఘాల సమస్య సాధనకై పిఆర్టియు ముందుంటుందనిఅన్నారు.ఈ కార్యక్రమంలోపి ఆర్ టి యు రాష్ట్రఅసోసియేషన్ అధ్యక్షులుబి లక్ష్మణ్,కే శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శిలు జనార్ధన్, సుధాకర్, మండల మహిళా కార్యదర్శిధనలక్ష్మి, మండల బాధ్యులు పనింద్ర,కో-ఆపరేటర్ సొసైటీ ట్రైనర్ సంతోష్,ఉపాధ్యక్షులుస్వామి, చంద్రశేఖర్, వెంకట్ రెడ్డి ,పుష్పలీల,జలీల్ తదితరులు ఉన్నారు.



## సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును ప్రభుత్వ సెలవు దినముగా ప్రకటించాలని

నెల్లికుదురు ఫిబ్రవరి 9 మేజర్ న్యూస్ (సూర్య)సంతు సేవరల్ మహారాజ్ జయంతినప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని ఎస్ టి సెల్ మండల అధ్యక్షులు ఎల్ హెచ్ పి ఎస్ కో కన్వీనర్ యాకుబ్ నాయక్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోవిశ్రాంతిభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ లంబాడీల ఆరాధ్య దైవం. లంబాడీల జీవితాలను ప్రభావితం చేసిన నాయకుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. లంబాడీలు బంజారా జాతుల పరువు ప్రతిష్టల గురించి ముందుగానే ఊహించినా సంత్ సేవాలాల్ అహింసా సిద్ధాంతానికి పునాది వేసినారు. విద్య వైద్యం అందించడంతో పాటు కొత్త జీవితాన్ని ప్రసాదించారు సంచార జీవనం కొనసాగిస్తున్న లంబాడీలకు తండాల రూపంలో స్థిరనివాసాన్ని అలవాటు చేసినది సంత్ సేవాలాల్ మహారాజని గొప్పగా చెప్పుకోవచ్చు అని ఫిబ్రవరి 15వ తేదీని ప్రభుత్వ సెలవు దినముగా ప్రకటించాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో గిరి నాయక్ ,చంద్రు నాయక్ ,బిక్ష నాయక్, వెంకన్న తదితరులుఉన్నారు.

# సంత్ శ్రీ, సేవలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా బానోత్ రాజు నాయక్



భూపాలపల్లి టౌన్ ఫిబ్రవరి 09 మేజర్ న్యూస్ సూర్య:సంత్ శ్రీ, సేవలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా బానోత్ రాజు నాయక్ ఎన్నికయ్యారు శుక్రవారం స్థానిక అంబేద్కర్ స్టేడియంలో భూపాలపల్లి జిల్లాలోని అన్ని కుల, విద్యార్థి సంఘాలు, గిరిజన మేధావులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సంత్ శ్రీ సేవలాల్ మహరాజ్ 285 వ జయంతి ని సమిష్టి గా అందరు కలిసి నిర్వహించాలని తీర్మానం చేశారు సంత్ శ్రీ సేవలాల్ మహరాజ్ జయంతి అధ్యక్షుడు గా బానోత్ రాజు నాయక్, ఉపాధ్యక్షులుగా అజ్మీర తిరుపతి నాయక్, భూక్య సురేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి గా అజ్మీర సమ్మయ్య, కార్యదర్శిగా నంగవత్ భాస్కర్ జడి కీర్తి భాయి అంగోత్ శారదా, కోశాధికారిగా, గుగులోత్ సంతోష్ నాయక్, గౌరవ అధ్యక్షులుగా ఇస్లావత్ దేవన్ నాయక్ అజ్మీర జంపన్న నాయక్ నంగవత్ రాజేష్ నాయక్, గౌరవ సభ్యులు గా గుగులోత్ వాలు నాయక్ భూక్య రమేష్ హత్కార్ రాజు భూక్య రూప్ సింగ్ భిక్షపతి నాయక్ అజ్మీర రాజు లవుడియా మదుకర్ నాయక్ లవుడియా రాజు నాయక్ లను నియమించారు.

# భారతరత్నం మన పీవీ



**మాజీ ప్రధాని నరసింహారావుకు భారత రత్న అవార్డు**

**కాంగ్రెస్ పార్టీ పీవీ ని ఏనాడు పట్టించుకోలేదు**

**లక్నేపల్లీలో పీవీ స్మారక మందిరంలో**

**బీజేపీ నాయకుల నివాళులు**

**బీజేపీ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్**

నర్సంపేట మేజర్ న్యూస్ (సూర్య ): దివంగత మాజీ ప్రధాని, రాజనీతిజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు సేవల్ని గుర్తించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న అవార్డు ప్రకటించి సమున్నతన స్థానం కల్పించిందని వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. పీవీ కి భారతరత్న ప్రకటించిన సందర్భంగా శుక్రవారం పీవీ నరసింహరావు జన్మస్థలం మండలం లోని లక్నేపల్లి గ్రామంలోని స్మారక మందిరం లో రవికుమార్ ఆధ్వర్యంలో పి వి విగ్రహానికి పూలమాల వేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పీవీ భారత రత్నకు ఎంపికవడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు తెలంగాణ



ముద్దుబిడ్డ పీవీ ప్రధానిగా బాధ్యత లు చేపట్టి అభివృద్ధి దిశగా నడిపించిన మహనీయుడని కొనియాడారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఏనాడూ అయన సేవల్ని గుర్తించ లేదని, ఆయన చనిపోతే కనీసం అయనకు ఢిల్లీ లో స్మృతి వనం కూడా నిర్మించ లేదని మండి పడ్డారు. కానీ నేడు కేంద్రం లోని ప్రదాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణా బిడ్డకు అత్యున్నత పురస్కారం ఇచ్చి గౌరవించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.. ఏనాడూ కూడా తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నేతలు పీవీ కి భారత రత్న ఇవ్వాలని పోరాడిన సందర్భం లేదని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి హోదాలో.. ఆర్థిక సంస్కరణలతో భారతదేశ పురోగతికి పీవీ పునాదులు వేసినా, జీవితాంతం కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీ సాధారణ కార్యకర్తనుంచి దేశ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించినా, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, కుటుంబ సభ్యులు ఏనాడూ పీవీ ని పట్టిచుకోలేదని, తుదిశ్వాస విడిచిన తర్వాత కూడా పార్టీ కార్యాలయంలోకి పార్థివదేహాన్ని రానీయకుండా దారుణంగా అవమానించిందని వాపోయారు. పీవీ కి భారత రత్న ఇవ్వడం దేశ ప్రజలందరికీ గర్వ కారణమని రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నరసింహరాములు, ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కంభంపాటి పుల్లారావు, యువ నాయకుడు రాణా ప్రతాపరెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు నల్లబెల్లి సుదర్శన్, శక్తి కేంద్ర ఇన్చార్జి బుసాని సుదర్శన్,ముతినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, బిజెపి నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు ఇన్సూరెన్స్ పత్రాలు తప్పకుండా కలిగి ఉండాలి



**పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు**

**నిబంధనలను ఉల్లంఘించినట్లయితే**

**శాఖ పరమైన చర్యలు తప్పవు**

**నెక్కొండ సిఐ చంద్రమోహన్**

చెన్నారావుపేట (సూర్య మేజర్ న్యూస్): ఆటో డ్రైవర్లు తప్పకుండా తమ వాహనాలకు ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని నెక్కొండ సిఐ చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు తమ వాహనాలకు తప్పకుండా ఇన్సూరెన్స్ పత్రాలను కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ కూడా తప్పనిసరి అని తెలిపారు. ఈనెల 24 వరకు తమ వాహనాలకు ఇన్సూరెన్స్ పత్రాలను తీసుకోవాలన్నారు. ఒకవేళ ఇన్సూరెన్స్ పత్రాలు లేని వాహనాలు రోడ్లపై తిరిగితే సీజ్ చేసి ఆర్టీవో అధికారులకు అప్పగించడం జరుగుతుందని హెచ్చరించారు.

అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని నియమ నిబంధనలను ఉల్లంఘించినట్లయితే శాఖ పరమైన చర్యలు తప్పవని అన్నారు..ఈ కార్యక్రమంలో ఎస్ఐ పస్తం శ్రీనివాస్, ఏఎస్ఐ లక్ష్మణమూర్తి, హెడ్ కానిస్టేబుల్లు స్వామి, ఎల్లయ్య, జంపయ్య, కానిస్టేబుల్ స్వామి నాయక్, తిరుపతి, సురేష్, అరవింద్, జ్ఞానేశ్వర్, స్వామి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



## కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు పూజలు

గణపురం ఫిబ్రవరి 09 మేజర్ న్యూస్ సూర్య: కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ దేవతలకు అభిషేకం అనంతరం పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతినెల కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

## నూతన పదవి బాధ్యతలు చేపట్టిన సిఐ విశ్వేశ్వర్



ధర్మసాగర్ ఫిబ్రవరి 9 (సూర్య న్యూస్): నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సిఐ విశ్వేశ్వర్ శుక్రవారం ధర్మ సాగర్ మండల పోలీస్ స్టేషన్ సీఐగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ విశ్వేశ్వర్ మాట్లాడుతూ, ధర్మ సాగర్ మండల ప్రజలు చెడు అలవాట్లకి దూరంగా ఉండాల ని పోలీస్ వారికి సహకరించాలని నేరపూరితమైనటువం టి చర్యలు చేపట్ట రాదని కోరారు.



## అసంక్రమిత వ్యాధుల ఆన్ లైన్ నమోదు తప్పనిసరి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎ.అంబరీష్



మహబూబాబాద్ టౌన్ ఫిబ్రవరి 09,మేజర్ న్యూస్ (సూర్య): అసంక్రమిత వ్యాధుల ఆన్ లైన్ నమోదును తప్పనిసరిగా చేపట్టాల ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎ.అంబరీష్ పేర్కొన్నారు. శుక్రవారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధి కారి డాక్టర్ అంబరీష్, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎ.నాగేశ్వరావుఆధ్వర్యంలోఅసంక్రమిత వ్యాధులకు సంబంధించి ఆన్లైన్ పోర్టల్లో 30 సంవత్సరాలు పైబడిన వారందరి బిపి, షుగర్, హైపర్ టెన్షన్ వ్యాధులను ఆన్లైన్లో ఏ విధంగా నమోదు చేయాలో జిల్లాలో ఉన్న ఏ.ఎన్.ఎం,ఎం హెచ్ పీ ల కు డాక్టర్ సురేష్డబ్ల్యూహెచ్వో కన్సల్టెంట్శిక్షణ ఇవ్వడం జరిగింది.ఇందులో భాగంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష్ మాట్లాడుతూ జిల్లాలో అసంక్రమిత వ్యాధులు, ఫాలో అప్ కేసులు ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని ఏఎన్ఎం లను,ఎం హెచ్ పీ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ నాగేశ్వరరావు,డాక్టర్ విజయ్ కుమార్,డాక్టర్ శ్రవణ్ కుమార్,డిప్యూటీ డెమో కె.ప్రసాద్ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ క్రిష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డ బోయిన శ్రీనివాస్,హెల్త్ ఎడ్యుకేటర్ కెవి రాజు, పురుషోత్తం ,గీత,డిపిఓ రుక్మొద్దిన్,రమేష్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలి



గూడూరు ఫిబ్రవరి 9 మేజర్ న్యూస్ (సూర్య ): ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ పిలుపుమేరకు శుక్రవారం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు అనంతరం సూపర్డెంట్ డాక్టర్ వీరన్న కు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా గోపు సంజీవ మాట్లాడుతూ కార్మికులకు మూడు నెలలుగా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ సానిటేషన్ సెక్యూరిటీ పేషంట్ కేర్ ఉద్యోగులకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి మూడు నెలల జీతా లు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు ప్రతినెల మొదటి వారంలో వచ్చేలా ప్రభుత్వం చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఈఎస్ఐ పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ శానిటేషన్ పేషంట్ కేర్లను ఉద్యోగులను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తిస్తూ సమాన పనికి సమాన వేతనం అందియాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో డిఆర్పి జ్యోతిఅజ్మీర తిరుపతి విజయశేఖర్ ఈసీజీ కుందూరు కరుణాకర్ రెడ్డి ఎలక్ట్రిషన్ లింగమూర్తి డ్రైవర్ సాంబయ్య సరోజ లక్ష్మి రంగమ్మ లోకేష్ పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



## గ్రామైక్య సంఘాలను బలోపేతం చేయాలి

## లోకోస్ లో మెంబర్ ప్రొఫైల్ పూర్తి చేయాలి

## డిఆర్డిఏ సెర్ప్ ఏపీడి గొట్టే శ్రీనివాస్

వర్ధన్నపేట,ఫిబ్రవరి 09,(మేజర్ న్యూస్ సూర్య):గ్రామైక్య సంఘాలను బలోపేతం చేసి మహిళలు అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలుచుటకు వివో ప్రతినిధులు కృషి చేయాలని డిఆర్డిఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గొట్టే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సెర్ప్ కార్యాలయంలో వివో ప్రతినిధుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తూ వివోఏ ల సమన్వయ సహకారంతో పేదలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిపరిచి జీవనోపాదులను పెంపొందించాలని సూచించారు. లింగ వివక్షత లేకుండా జెండర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. రెండు రోజుల్లో లోకోస్ లో మెంబర్ ప్రొఫైల్ డాటా ఎంట్రీ ని పూర్తి చేయాలని అన్నారు. ప్రతినిధులు సిబ్బంది జంటలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో డిపిఎం భవాని ఎ పి ఎంలు వీర్ల వేణు, అశోక్, ఎర్రవెల్లి వేణుగోపాలరావు, మండల సమైక్య అధ్యక్ష కార్యదర్శులు అరుణ, పల్లవి, సునీత ,సీసీలు గోలి కొమరయ్య, రమేష్ ,సంపత్ ,స్వామి, అన్ని గ్రామాల వివోల ప్రతినిధులు, వివోఏలు పాల్గొన్నారు.



# వేరుశనగ పంట దిగుబడికి జిప్సం వాడాలి



## ఇన్చార్జి ఈవో రామకృష్ణ

నర్సింహులపేట ఫిబ్రవరి 9 సూర్య మేజర్ న్యూస్ వేరుశనగ పంట దిగుబడికి జిప్సం వాడాలి ఏఈఓ రామకృష్ణ. శుక్రవారం మండలంలోని వంతడుపుల గ్రామం లో వేరుశనగ పంటలను పరిశీలించారు.వేరుశనగ యాజమాన్యం మరియు జిప్సం వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయనే మాట్లాడుతూ వేరుశనగ లో గంధకం మొక్కల్లో శ్వాసక్రియకు, వేరుపైబుడిపెల అభివృద్ధికి, పత్రహరిత అభివృద్ధికి, వేరుసెనగ కాలయ రంగు అభివృద్ధికి ఆకులు ముందే రాలకుండా అరికట్టడం, మొక్కలకు కాయలు (ఊడలకు) గట్టిగా అతుక్కొని ఉండటానికి, నూనె తయారుచేసే ప్రక్రియలో ప్రముఖపాత్ర వహిస్తుంది. మొక్కలో తగినంత గంధకం ఉండటం వల్ల మాంసకృత్తులు తయారవడం, ఎంజైములు పనిచేసే సామర్థ్యం పెరిగిమొక్క దృడంగా ఉంటుందని ఆయన అన్నారు.గంధక లోప లక్షణాలుగంధకం లోపిస్తే చెట్టు ఆకులు పసుపు పచ్చగా మారుతాయని లేత ఆకులు చిన్నవిగా, రంగు కోల్పోయి నిటారుగా ఉంటాయి. అయితే ముదురు ఆకులు మాత్రమే ఆకుపచ్చగా ఉంటాయని ఆయన అన్నారు.మొక్కలు గంధకం గ్రహించే విధానం పంటకాలంలో సుమారుగా 0.2 శాతం గంధకం వేరుసెనగ ఆకుల్లో ఉంటుంది. ఊడలు, కాయల గంధకాన్ని గ్రహిస్తాయి కాయలు పెరిగే సమయంలో తగినంత గంధకం కాని, లభ్యమయ్యేటట్లు చూడాలి. గంధకాన్ని మొక్కలు భూమి నుంచి గాక వాతావరణం నుంచి ఆకులు సల్ఫర్ డై ఆక్సైడ్గా కూడా గ్రహిస్తాయని అన్నారు. జిప్సం వేసే పద్ధతి కాల్షియం, గంధకం లోపం వల్ల వచ్చే లోప లక్షణాలు జిప్సం వేయటం ద్వారా అరికట్టవచ్చు. ఎకరాకు 200 కిలోల జిప్సంను పంట తొలిపూత సమయంలో కలుపు తీసేటప్పుడు, మొక్కల మొదళ్లలో పడేటట్లు వేయాలి.

వర్షాభావ పరిస్థితుల్లో జిప్సంను ఊడలు దిగే సమయం అంటే రెండోసారి కలుపుతీసే సమయంలోగా వేయటం వల్ల ఊడలు కాల్షియంను గ్రహించి, కాయలు బాగా నిండుగా ఊరడానికి దోహదం చేస్తుంది. జిప్తం వేసే సమయంలో నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. ఉప్పులను విత్తేటప్పుడు లేదా విత్తిన 25 నుండి 30 రోజులకు వేయడం వల్ల లేదా 2 దఫాలుగా వేయడం వల్ల వేరుసెనగ మొక్కలు కాల్షియం, గంధకాన్ని ఎక్కువగా గ్రహించడమే గాక నత్రజని, భాస్వరం, పొటాష్ లను కూడా ఎక్కువగా గ్రహిస్తాయి. జిప్సం వేసిన వేరుసెనగలో ఇతర పోషకాలను తీసుకోవడం కూడా ఎక్కువగానే ఉంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రైతులు బానోత్ నాగులు, యాకూబ్, ఏఈవోలు పాల్గొన్నారు.